

ట్యాంకర్లతో తాగునీరందించండి

అధికారులతో డిప్యూటీ స్పీకర్ ఆర్ఆర్ఆర్ సమీక్ష

ప్రజాశక్తి - ఆకివీడు

పట్టణంలో ప్రజల దాహార్తి తీర్చేందుకు తాగునీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని డిప్యూటీ స్పీకర్, ఉండి ఎంఎల్ఎ కనుమూరు రఘురామకృష్ణరాజు అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం అప్రమత్తంగా ఉండి చర్యలు చేపట్టాలన్నారు. మంగళవారం స్థానిక నగర పంచాయతీ కార్యాలయంలో కమిషనర్ ఛాంబర్లో ఆయన అధికారులతో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో డైలీ మార్కెట్ను అయిభీమవరం రోడ్లోకి కొంత, గ్రామ పంచాయతీ పశువుల బంది దొడ్డిగా వాడిన ఖాళీ స్థలంలోకి కొంత మార్చాలని సూచించారు. ఆటో స్టాండ్ను ఐ.భీమవరం రోడ్డులోకి మార్చాలన్నారు. దొరగారి చెరువు తవ్వించడంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సమీక్షకు మండలంలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు, కూటమి నేతలు హాజరయ్యారు.

కాళ్లు మొక్కుతూ.. న్యాయం కోరుతూ..!

తొలిరోజు కొల్లేరులో పర్యటించిన కేంద్ర సాధికారిక కమిటీ

వేలాది మంది కొల్లేరువాసులు రోడ్లపైకి వచ్చి న్యాయం చేయాలని వేడుకోలు

కమిటీ సభ్యుల కాళ్లపై పడి న్యాయం చేయాలని కన్నీటి పర్యంతం

కొల్లేటికోట గ్రామంలో సభకు పోటెత్తిన జనం

కమిటీకి సమస్యలు వివరించిన కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎంఎల్ఎలు, ప్రజాసంఘాలు, ప్రజలు

మూడో కాంటూరుకు కుదించాలని, జిరాయితీ, సొసైటీ భూములు ఇవ్వాలని విన్నపం

నేడు రెండో రోజు కొనసాగనున్న కమిటీ పర్యటన



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, దెందులూరు, ఏలూరు సిటీ

కొల్లేరు అధ్యయనానికి వచ్చిన కేంద్ర సాధికారిక కమిటీ సభ్యుల కాళ్లపై పడి తమకు న్యాయం చేయాలని కొల్లేరు ప్రజలు వేడుకున్నారు. జిరాయితీ భూములు, ప్రభుత్వం ఇచ్చిన సొసైటీ భూముల్లో చెరువులను ధ్వంసం చేశారని, ఉపాధి పోయి రోడ్డున పడ్డామని, రోడ్లతోపాటు ఏఒక్క అభివృద్ధి పనీ చేయకుండా ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడంతో తమ పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని సాధికారిక కమిటీ సభ్యుల వద్ద కొల్లేరు ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. కమిటీ రెండు రోజుల పర్యటనలో భాగంగా మంగళవారం దెందులూరు, కైకలూరు నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల్లో సాధికారిక కమిటీ చంద్రప్రకాష్ గోయల్, డాక్టర్ జెఆర్.భట్, జి.భానుమతి, సునీల్లిమాయే బృందం పర్యటించింది. విజయవాడ నుంచి మధ్యాహ్నం 1.30 గంటలకు ఏలూరు చేరుకున్న కమిటీ భోజనం అనంతరం కొల్లేరు గ్రామాలైన శ్రీపర్రు, కలకుర్రు, పెద్దఎడ్లగాడ, కైకలూరు మీదుగా ఆటపాక, కొల్లేటికోట గ్రామాల్లో పర్యటించింది. వారి వెంట జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి, ఎస్పి కె.ప్రతాప్ శివకిషోర్, ఎంఎల్ఎలు కామినేని శ్రీనివాస్, చింతమనేని ప్రభాకర్, పత్సమట్ల ధర్మరాజు ఉన్నారు. కొల్లేటికోటలో జరిగిన బహిరంగ సభలో కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎంఎల్సి జయమంగళ వెంకటరమణ, ఇతర నాయకులు పాల్గొన్నారు. కమిటీ వస్తుందని తెలిసి కొల్లేరు గ్రామాల ప్రజలంతా పెద్దఎత్తున రోడ్లపైకి, కొల్లేటి కోట సభకు తరలొచ్చారు. శ్రీపర్రులో పెద్దఎత్తున మహిళలు, గ్రామస్తులు కమిటీ కోసం వేచిచూశారు. అయితే కమిటీ సభ్యులు వారిని పలకరించి ఏమీ మాట్లాడకుండానే వెళ్లిపోయారు. ఎంఎల్ఎ కామినేని శ్రీనివాస్ మాట్లాడుతూ మీ సమస్యలన్నీ కమిటీకి వివరించామన్నారు. అనంతరం కలకుర్రు గ్రామానికి కమిటీ వెళ్లింది. మధ్యలో కొల్లేరు ప్రాంతాన్ని పరిశీలించి, అక్కడే మ్యాప్ పాయింట్ ద్వారా అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పలుచోట్ల కొల్లేరు గ్రామస్తులు కమిటీ సభ్యుల వద్ద మాట్లాడుతూ కొల్లేరు లంక గ్రామాల్లో రహదారులు లేక రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కొల్లేరు ఆపరేషన్ అనంతరం తమ జీవనం దుర్భరంగా మారిందని, పిల్లా పాపలతో వలసలు పోవాల్సి వస్తుందని తెలిపారు. పర్యావరణానికి, పక్షులకు ఆటంకం కలగకుండా కొల్లేరులో అదనంగా కొట్టివేసిన సొసైటీ, జిరాయతీ భూములను తిరిగి పునరుద్ధరించి ఆదుకోవాలని వారు కమిటీని వేడుకున్నారు. కొల్లేటికోటలో జరిగిన బహిరంగ సభలో ప్రజాప్రతినిధులంతా కొల్లేరు ప్రజల ఇబ్బందులను కమిటీకి వివరించారు. సిపిఎంతోపాటు వివిధ ప్రజాసంఘాలు, పలు గ్రామాల నుంచి వచ్చిన వారంతా దాదాపు 45 వినతులను కమిటీకి అందించారు. కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలని, జిరాయితీ, సొసైటీ భూములను అప్పగించాలని కోరారు. రెండో రోజు బుధవారం ఉంగుటూరు నియోజకవర్గంలో కమిటీ పర్యటించనుంది.



హాజరైన కొల్లేరు ప్రజలు

కొల్లేరు ప్రజల సమస్యలను కమిటీకి హిందీలో వివరించిన చింతమనేని కుమార్తె నవ్య

కలకుర్రు గ్రామానికి వెళ్లే రోడ్డులో ఆగి కొల్లేరు చెరువులను కమిటీ పరిశీలించింది. అక్కడి ప్రజల జీవన విధానం, అభయారణ్యం పరిధి, ప్రస్తుతమున్న పరిస్థితులను చీఫ్ ఫారెస్ట్ ఆఫీసర్ ఎకె.నాయక్ కమిటీకి వివరించారు. దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ కల్పించుకుని చేపల సాగు ఆవశ్యకత, వెంగళరావు ప్రభుత్వం చెరువులు తవ్వించడం, ప్రస్తుతం ప్రజల ఇబ్బందులు, సంప్రదాయం పేరిట అటవీ శాఖ అధికారులు పెడుతున్న ఇబ్బందులను పొడిపొడి ఆంగ్ల పదాలతో వారికి వివరించే ప్రయత్నం చేశారు. కమిటీ సభ్యులు హిందీలో మాట్లాడుతుండటంతో చింతమనేని కుమార్తె నవ్య అక్కడికి చేరుకుని ప్రజల జీవన విధానం, చేపల సాగుకు ఎదురవుతున్న ఇబ్బందులు, సాగుదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు, అటవీ అధికారులు సృష్టిస్తున్న అడ్డంకులను కమిటీకి హిందీలో వివరించారు. దీనిపై కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిఒ 120 ప్రకారం అభయారణ్య పరిధిలో సహజ, సంప్రదాయ పద్ధతిలోనే సాగు సాగాలన్నారు. చింతమనేని కుమార్తె మాట్లాడుతూ సంప్రదాయం పేరిట సాగు చేస్తే బ్యాంకులు రుణాలు ఇవ్వవని, దానివల్ల భూములున్న వారు కూడా పేదలుగా మిగిలిపోతున్నారని చెప్పారు. కలెక్టర్లా భలే వివరించావని, యంగ్ కలెక్టర్ అంటూ చింతమనేని కుమార్తెను కమిటీ సభ్యులు అభినందించారు.

సుప్రీంకోర్టుకు నివేదిక సమర్పిస్తాం

తొలిరోజు కొల్లేరు ప్రాంతంలో పర్యటించిన కేంద్ర సాధికారిక బృందం రాత్రి ఎనిమిది గంటలకు ఏలూరు కలెక్టరేట్లోని గోదావరి సమావేశ మందిరానికి చేరుకుంది. పలువురు కొల్లేరు గ్రామస్తుల నుంచి వినతులు స్వీకరించింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మీడియాతో మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం కొల్లేరులో పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఎంఎల్ఎలు, కేంద్రమంత్రి సమస్యలను వివరించారన్నారు. ప్రజల నుంచి వినతులు వచ్చాయన్నారు. బుధవారం అధికారులతో సమావేశమవుతామన్నారు. అన్నింటినీ అధ్యయనం చేసి సుప్రీంకోర్టుకు నివేదిస్తామన్నారు.

కొల్లేరును మూడో కాంటూరుకు కుదించాలి

ప్రజలను ఆదుకోవాలంటూ కేంద్ర సాధికారిక కమిటీకి సిపిఎం బృందం వినతి

కొల్లేరు సమస్యలను కమిటీకి నివేదించిన సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి, మండవల్లి, కాళ్ల

కొల్లేరును మూడో కాంటూరుకు కుదించి, అక్కడి ప్రజల ఉపాధిని కాపాడి కొల్లేరు ప్రజలను ఆదుకోవాలని కేంద్ర సాధికారిక కమిటీకి సిపిఎం బృందం వినతిపత్రం అందించింది. కొల్లేరుపై అధ్యయనానికి కేంద్ర సాధికారిక కమిటీ బృందం చంద్రప్రకాష్ గోయల్, డాక్టర్ జెఆర్.భట్, జి.భానుమతి, సునీల్లిమాయి మంగళవారం కొల్లేరులో పర్యటించారు. విజయవాడ నుంచి ఏలూరు చేరుకున్న కమిటీ సభ్యులు అక్కడి నుంచి ఏలూరు జిల్లా పరిధిలో కొల్లేరు గ్రామాలైన శ్రీపర్రు, కలకుర్రు, పెద్దఎడ్లగాడ, ఆటపాక ప్రాంతాల్లో పర్యటించి కొల్లేటికోటకు చేరుకుంది. అక్కడ ఏర్పాటు చేసిన సభలో కమిటీ సభ్యులు ప్రజలు, ప్రజాసంఘాల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా సిపిఎం బృందం కొల్లేరు ప్రజలు సమస్యలపై కమిటీకి వినతిపత్రం అందించి, వివరించింది. కొల్లేరు ప్రజలకు నష్టం కల్గించే ఎకో సెన్సిటివ్ జోన్ను ఉపసంహరించుకోవాలని, కొల్లేరు ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు, అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని అమలు చేయాలని కోరారు. కొల్లేరును ఐదు నుండి మూడో కాంటూరుకు కుదిస్తామన్న పాలకుల హామీలు అమలు కాలేదని తెలిపారు. కొల్లేరులో 46 బెడ్ గ్రామాలు, 74 బెల్ట్ గ్రామాల్లో మూడు లక్షల మంది మత్స్యకారులు, దళితులు ఉన్నారని వివరించారు. 1975-76 కాలంలో అప్పటి వెంగళరావు ప్రభుత్వం 146 సొసైటీలు ఏర్పాటు చేసి 7,100 ఎకరాల్లో చేపల చెరువులు తవ్వించారని గుర్తు చేశారు. 2006లో ఆపరేషన్ కొల్లేరు పేరుతో ఐదో కాంటూరు లోపల ఉన్న వేలాది ఎకరాల్లోని చెరువులన్నింటినీ ధ్వంసం చేసి లక్షలాది మంది కొల్లేరు ప్రజల జీవనాన్ని నాశనం చేశారన్నారు. ఐదో కాంటూరు పరిధిలో 77,138 ఎకరాల చెరువులు ధ్వంసం పేరుతో 86 వేల ఎకరాలకుపైగా చెరువులను ధ్వంసం చేశారని తెలిపారు. 7,100 ఎకరాల సొసైటీ చెరువులు, 14,800 ఎకరాల్లో జిరాయితీ భూముల చెరువులను ధ్వంసం చేశారని వివరించారు. కొల్లేరులోని వేలాది మంది ప్రజలు పొట్ట నింపుకునేందుకు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లారని, వెళ్తున్నారని తెలిపారు. మిగిలిన కొద్దిమంది ప్రజలూ ప్రతిరోజూ వందలాది కిలోమీటర్లు ఉపాధి కోసం వెళ్లొస్తున్నారన్నారు. 120 జిఒ ఆధారంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పర్యావరణాన్ని పరిరక్షిస్తామనే పేరుతో కొల్లేరును ధ్వంసం చేయడమే దీనికి కారణమని వివరించారు. అయితే పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత నుంచి పూర్తిగా వైదొలిగారని, ఆనాడు ప్రభుత్వం ఇచ్చిన హామీలేవీ నేటికీ అమలు కాలేదని తెలిపారు. కొల్లేరులో రెగ్యులేటర్లు నిర్మిస్తామని, పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేస్తామని, ఉపాధి కల్పిస్తామని చెప్పారని, కోట్లాది రూపాయల నిధులు విడుదల చేశారని, ఆ నిధులతో ఒక్కరికైనా ఉపాధి కల్పించిన పరిస్థితి లేదని తెలిపారు. ఈ పరిస్థితుల్లో 15 వేల ఎకరాల్లో గట్లు వేసుకుని కొన్ని చెరువులను కొల్లేరు ప్రజలు సాగు చేసుకుంటున్నారని, మిగిలిన కొల్లేరు తుమ్మ చెట్లు, కిక్కిసతో నిండిపోవడంతో చేపల వేటకు వెళ్లే పరిస్థితి లేదని వివరించారు. ఫారెస్ట్ అధికారుల వేధింపులు, లంచాలు పెరిగిపోయి కొల్లేరు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కొల్లేరు ప్రజల ఉపాధికి నష్టం కలిగించేలా కొంతమంది పర్యావరణం పేరుతో సుప్రీంకోర్టుకు వెళ్లినప్పుడు సాగులో ఉన్న 15 వేల ఎకరాల చెరువులు ధ్వంసం చేయాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని తెలిపారు. అయితే ఈ కేసులో రాష్ట్ర ప్రభుత్వం ఇంప్లీడ్ కాకపోవడం వల్ల సుప్రీంకోర్టు ఏకపక్షంగా తీర్పునిచ్చిందని వివరించారు. చెరువులు పూర్తిగా ధ్వంసం చేశారని, కొల్లేరు ప్రజల ప్రస్తుత సమస్యలు పరిష్కరించడం మాని, కొత్త సమస్యలు సృష్టిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మూడో కాంటూరుకు కుదింపును పక్కనబెట్టి, ఐదో కాంటూరు నుండి పది కిలోమీటర్ల వరకూ సున్నిత పర్యావరణ ప్రాంతం పేరుతో 26 నిబంధనలను పెట్టి కొల్లేరు మొత్తాన్ని అష్టదిగ్బంధనం చేసి పూర్తిగా ఫారెస్ట్ డిపార్టుమెంట్ చేతుల్లో పెట్టబోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లాలో కొల్లేటి ప్రాంతమైన నిడమర్రు, ఉంగుటూరు, భీమడోలు, దెందులూరు, ఏలూరు, పెదపాడు, మండవల్లి, కైకలూరు, ఆకివీడు మండలాలలోని 89 గ్రామాలపై ఈ ప్రభావం పడనుందని తెలిపారు. ఇలాంటి పరిస్థితుల్లో మరోసారి సున్నిత పర్యావరణ ప్రదేశం పేరుతో ఐదో కాంటూరుపైన పది కిలోమీటర్ల వరకు ఎలాంటి అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టరాదని, కనీసం కట్టెల పొయ్యి కూడా వెలిగించడానికి వీలులేదని, ఇప్పటికే ఉన్న పరిశ్రమలు మినహా ఆ పరిశ్రమలను విస్తరించుకోవడానికిగాని, కొత్త పరిశ్రమలు పెట్టడానికిగాని, భూగర్భ జలాలు వాడుకోవడానికిగాని ఎలాంటి అనుమతులు ఉండవని తెలిపారు. ఇలాంటి దారుణమైన 26 నిబంధనలను పెట్టి కొల్లేరు చుట్టుపక్కల 89 గ్రామాల్లోని లక్షలాది మంది ప్రజల పొట్ట కొట్టే నిర్ణయాన్ని తక్షణమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజాభిప్రాయ సేకరణ పేరుతో అధికారులు తూతూమంత్రంగా అభిప్రాయాలు సేకరించి నివేదికలు పంపించడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. తర్వాత గ్రామసభల నివేదిక ద్వారానే హద్దులు నిర్ణయిస్తామని చెబుతున్నారని, లైడార్ సర్వే జరిపారని, ఎకో సెన్సిటివ్ జోన్పై ప్రజలకు వాస్తవాలు చెప్పాలని కోరారు. సిపిఎం బృందంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.లింగరాజు, డిఎన్విడి.ప్రసాద్ ఉన్నారు.

ధర కోసం కోకో రైతులు సంఘటితంగా పోరాడాలి

కోకో బోర్డు ఏర్పాటు చేయాలి

వెంకట్రామన్నగూడెంలో కోకో పరిశోధనా కేంద్రం నెలకొల్పాలి

ఎపి కోకో రైతుసంఘం ఆధ్వర్యాన సదస్సులో నేతలు

అంతర్జాతీయ మార్కెట్ ధర కోసం కోకో రైతుల ఉద్యమం

రిటైర్డ్ డిజిపి ఎబి.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం రూరల్

గిట్టుబాటు ధర కోసం, కార్పొరేట్ కంపెనీల మోసాలకు వ్యతిరేకంగా కోకో రైతులు సంఘటితంగా పోరాడాలని పలువురు నేతలు పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మార్కెట్ ధరకు అనుగుణంగా ఫార్ములా రూపొందించి కోకో గింజలకు ధర నిర్ణయించి కోకో రైతులకు న్యాయం చేయాలని ఎపి కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో జరిగిన కోకో రైతుల సదస్సు ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. మంగళవారం తాడేపల్లిగూడెం మండలం కొమ్ముగూడెంలో శ్రీ ధనలక్ష్మి రైస్మిల్లు ఆవరణలో ఆంధ్రప్రదేశ్ కోకో రైతుల సంఘం ఆధ్వర్యంలో కోకో రైతుల సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ల వెంకట సుబ్బారావు అధ్యక్షత వహించారు. కోకో రైతుల సమస్యలు చర్చించి పలు తీర్మానాలు ఆమోదించారు. ముఖ్యఅతిథిగా విచ్చేసిన రిటైర్డ్ డిజిపి, ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎబి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో కోకో కొనుగోలు కంపెనీలు కిలోకు రూ.450 మాత్రమే ధర ఇస్తూ రైతులను మోసగిస్తున్నాయని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కిలోకు రూ.50 సబ్సిడీ ఇవ్వడంతో కిలో కోకో గింజల ధర రూ.500గా నిర్ణయించారని, ఈ ధర ఏమాత్రం గిట్టుబాటు కాదని అన్నారు. కోకో రైతులను రాష్ట్రవ్యాప్తంగా సంఘటితం చేసి రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసి కోకో గింజలను రైతులే మార్కెటింగ్ చేసుకునేలా తాము కృషి చేస్తున్నట్లు వివరించారు. ఈ మహత్తర కార్యక్రమానికి రిటైర్డ్ అధికారులు, చదువుకున్న యువత తదితరుల సహకారం తీసుకుంటున్నట్లు చెప్పారు. కోకో రైతులంతా సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రైతాంగం కనీస మద్దతు ధర చట్టబద్ధత కోసం పోరాడుతున్నారన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం ఉత్పత్తి ఖర్చులకు అదనంగా 50 శాతం ధర ఇచ్చినప్పుడే రైతు నిలబడగలుగుతాడని అన్నారు. రైతులు సంఘటితంగా లేకపోవడం వల్ల కంపెనీలు సిండికేట్గా మారి మోసగిస్తున్నాయని విమర్శించారు. ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిన ధరకు అనుగుణంగా రైతుల వద్ద ఉన్న గింజలను పూర్తిగా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కంపెనీలు ధర తగ్గించి కొనుగోలు చేస్తే పోరాటం చేస్తామని హెచ్చరించారు. కోకో బోర్డును ఏర్పాటు చేయాలని, వెంకట్రామన్నగూడెంలో కోకో పరిశోధనా కేంద్రం నెలకొల్పాలని డిమాండ్ చేశారు. విదేశీ కోకో గింజల దిగుమతులు నిలుపుదల చేయాలని కోరారు. సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొల్లు రామకృష్ణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు బోళ్ల వెంకట సుబ్బారావు, ఉప్పల కాశీ, ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి ఎ.హరేరాం, జిల్లా ఉపాధ్యక్షులు సిహెచ్.పుల్లారెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కోకో గింజల సీజన్లో అంతర్జాతీయ మార్కెట్ ధర అమలు చేయకపోవడం వల్ల రైతులు రూ.వందల కోట్లు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కంపెనీల సిండికేట్ విధానాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు. సదస్సులో ఎపి కోకో రైతుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆలపాటి వాసు, రాయల కాశీ బాబు, వివిధ గ్రామాలకు చెందిన కోకో రైతులు గారపాటి వైకుంఠం, సూరపని వెంకట్రావు,యలమాటి బులి కష్టారావు, పూడి సత్యనారాయణ, మేక సూర్యనారాయణ, నడుంపల్లి ప్రసాదరాజు, వాకలపూడి రామచంద్రరావు, గుండుబోగుల బలుసులు, పరిమి వెంకటేశ్వరరావు, పిచ్చుకల అమ్మాన్ రాజా, వెలిశెట్టి సోమరాజు, ఎస్ఆర్కె.చౌదరి, వట్టికూటి రమేష్బాబు, యలమాటి విశ్వేశ్వరరావు, చేకూరి భాస్కరరావు, పోలిన అప్పారావు, కె.సత్తిరాజు, వట్టికూటి వెంకట రామారావు, డి.వీర్రాజు, కె.నెహ్రూరెడ్డి, ఎం.సత్యనారాయణ పాల్గొన్నారు.



అభివాదం చేస్తున్న రైతు నేతలు

మున్సిపల్ కార్మికులకు 'తల్లికి వందనం' ఇవ్వాలి

ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలి

సిఐటియు ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - భీమవరం టౌన్

మున్సిపల్ కార్మికులందరికీ తల్లికి వందనం పథకం అమలు చేయాలని, ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద మంగళవారం సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి.వాసుదేవరావు మాట్లాడారు. మున్సిపాల్టీని నమ్ముకుని ఎన్నోఏళ్లుగా పని చేస్తున్న కార్మికులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఎన్నికల ముందు ఎలాంటి కోతలూ లేకుండా సూపర్ సిక్స్ పథకాల అమలు చేస్తానన్న కూటమి ప్రభుత్వం నేడు అనేక కోతలు విధిస్తోందని విమర్శించారు. మున్సిపల్ పారిశుధ్య కార్మికుల కుటుంబాలకు తల్లికి వందనం అమలు చేయకపోవడం బాధాకరమన్నారు. మున్సిపల్ కార్మికులకు జిఒ ఎంఎస్ నెం.26 ప్రకారం ఆదాయంతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రభుత్వం చెప్పి, నేడు దానికి భిన్నంగా కోతలు విధించడాన్ని ఖండించారు. మున్సిపాల్టీలో పని చేస్తున్న ఇంజినీరింగ్ కార్మికులకు కనీస వేతనం అమలు చేయడం లేదని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని మున్సిపల్ మేనేజర్కు అందించారు. ధర్నాలో యూనియన్ నాయకులు నీలాపు రాజు, ఎస్కె.నాగూర్, బంగారు వరలక్ష్మి, ధనారావు, చిన్న పెద్దిరాజు, మామిడి శివ, పల్లా రాజు, చిన్ని కుమార్, రాజు తదితరులు పాల్గొన్నారు.



అసిస్టెంట్ కమిషనర్కు వినతిపత్రం అందజేస్తున్న సిఐటియు నాయకులు

తణుకు: మున్సిపల్ కార్మికులకు ఎలాంటి నిబంధనలూ లేకుండా తల్లికి వందనం ఇవ్వాలని సిఐటియు జిల్లా కార్యదర్శి పివి.ప్రతాప్ కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చిరుద్యోగులకు తల్లికి వందనం అమలు చేయాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ గత ప్రభుత్వ కాలంలో అమ్మఒడి మున్సిపల్ పారిశుధ్య కార్మికులకు ఇచ్చారని, ఇప్పుడు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. పారిశుధ్య కార్మికులకు రేషన్ కార్డులు కూడా ఇవ్వకపోతే ఎలా బతుకుతారని ప్రశ్నించారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు ప్రభుత్వ పథకాలు అమలు చేయాలని, లేనిపక్షంలో వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నేతలు ఎన్.ఆదినారాయణబాబు, గుబ్బల గోపి, గార రంగారావు, అర్జి కృష్ణబాబు, గట్టు కుసుమ, మందులయ్య, ముప్పిడి శ్రీను, కె.అయ్యప్ప, కె.రాణి, కె.సురేష్, ఎం.నాగేంద్రకుమార్, అయినవల్లి సత్యనారాయణ, నేలపాటి మరియన్న, వి.రమేష్, పోతయ్య, కృష్ణారావు, రాజేశ్వరి, నాగరాజు, ఎం.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పాలస్తీనా, ఇరాన్పై ఇజ్రాయిల్ దాడులు ఆపాలి

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ధర్నా

ప్రజాశక్తి - తణుకు

పాలస్తీనా, ఇరాన్లపై ఇజ్రాయిల్ దాడులను తక్షణం ఆపాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు పివి.ప్రతాప్ డిమాండ్ చేశారు. స్థానిక బ్యాంక్ కాలనీలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో దాడులను నిరసిస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ అమెరికా ఇజ్రాయిల్ వెనుక ఉండి అసత్యాల పేరుతో యుద్ధం చేస్తుందన్నారు. కార్యక్రమంలో శ్రీశ్రీ విజ్ఞాన కేంద్రం ఛైర్మన్ పి.దక్షిణామూర్తి, పిఎల్.నర్సింహారావు, గుబ్బల గోపి, వల్లూరి వెంకటేశ్వరావు, కె.నాగరత్నం, గార రంగారావు, ఎన్.ఆదినారాయణబాబు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న నేతలు

ఆదిత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ ప్రారంభం

భీమవరంలో కార్పొరేట్ వైద్యం అందుబాటులోకి: ఎంఎల్ఎ అంజిబాబు

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పట్టణ ప్రజలు సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సేవలు అందాలంటే వేరే ప్రాంతాలకు వెళ్లేవారని, ప్రస్తుతం మన భీమవరంలోనే కార్పొరేట్స్థాయి వైద్యం అందుబాటులోకి వచ్చిందని పిఎసి ఛైర్మన్, ఎంఎల్ఎ పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. స్థానిక జెపి రోడ్డులో ఆదిత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ను మంగళవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వైద్యరంగంలో పెను మార్పులు వచ్చాయని, ఆ మార్పులకు అనుగుణంగా సూపర్ స్పెషాలిటీ సేవలు అందుబాటులోకి వస్తున్నాయని, ఈ ఆస్పత్రి ద్వారా సామాన్యులకు కూడా అందుబాటులో సూపర్ స్పెషాలిటీ సేవలు అందుతాయని అన్నారు. డాక్టర్లు బి.అశోక్కుమార్, డాక్టర్ రత్న ఆదిత్య మాట్లాడుతూ అత్యాధునిక సాంకేతిక టెక్నాలజీతో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్య సేవలను అందిస్తున్నామన్నారు. అనంతరం ఎంఎల్ఎ అంజిబాబును సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఆదిత్య సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ను ప్రారంభిస్తున్న ఎంఎల్ఎ అంజిబాబు

నేడు తెన్నేటి లక్ష్మి సంస్మరణ సభ

హాజరు కానున్న సిపిఎం రాష్ట్ర, జిల్లా నాయకులు

ప్రజాశక్తి - యలమంచిలి

మండలంలోని చించినాడ గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకురాలు, మహిళా ఉద్యమ నేత తెన్నేటి లక్ష్మి సంస్మరణ సభ ఈ నెల 18వ తేదీ బుధవారం జరుగుతుందని ఆ పార్టీ మండల కార్యదర్శి కానేటి బాలరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అరుంధతీపేటలోని తెన్నేటి లక్ష్మి స్వగృహం వద్ద జరిగే సభలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు బి.బలరాం, రాష్ట్ర నాయకులు మంతెన సీతారాం, జిల్లా కార్యదర్శి జెఎన్వి.గోపాలన్, సీనియర్ నేత కేతా సూర్యారావు, ఆచంట మాజీ ఎంఎల్ఎ దిగుపాటి రాజగోపాల్, ఐద్వా జిల్లా కార్యదర్శి పొగాకు పూర్ణ తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ సభకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులు విచ్చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఈ స్కూల్లో ఆరుగురు పిల్లలే

పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక

ప్రజాశక్తి - పెనుమంట్ర


లక్షల రూపాయల వ్యయంతో గత ప్రభుత్వ హయాంలో నాడు - నేడు కింద పెనుమంట్ర గ్రామ ప్రధాన చర్చి వీధిలోని మండల పరిషత్ (ఎల్ఇ) ప్రాథమిక పాఠశాల భవనాన్ని నిర్మించారని, ప్రస్తుత ప్రభుత్వం కేవలం ఆరుగురు పిల్లలు మాత్రమే ఉన్న స్కూల్గా మార్చిందని పెనుమంట్ర సర్పంచి తాడిపర్తి ప్రియాంక అన్నారు. మంగళవారం విలేకరులతో ఆమె మాట్లాడారు. మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను తొమ్మిది రకాలుగా విభజించిన ప్రభుత్వం ఈ పాఠశాలను ఫౌండేషన్ పాఠశాలగా మార్చిందని తెలిపారు. కేవలం 1, 2 తరగతులను మిగిల్చి, 3, 4, 5 తరగతులకు చెందిన 24 మంది పిల్లలను దూరంగా ఉన్న మెయిన్ పాఠశాలకు తరలించారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. లక్షల రూపాయలతో నిర్మించిన పాఠశాలలో ప్రస్తుతం 1లో ఇద్దరు, 2లో నలుగురు పిల్లలు మాత్రమే ఉన్నారని, ఇలాగే ఉంటే వచ్చే ఏడాది పాఠశాల మూతపడి, నూతన భవనం నిరుపయోగం అవుతుందని తెలిపారు. అధికారులు ఇక్కడ పిల్లలను వెనక్కి రప్పించి, పాఠశాలను కాపాడాలని సర్పంచి ప్రియాంక డిమాండ్ చేశారు.



ఉప సర్పంచి శ్రీనివాసరావుకు పితృవియోగం

ప్రజాశక్తి - వీరవాసరం

తోలేరు ఉపసర్పంచి భోగిరెడ్డి శ్రీనివాసరావు తండ్రి భోగిరెడ్డి సత్యనారాయణ (80) వయోభారంతో మంగళవారం మృతి చెందారు. గత కొంత కాలంగా ఆయన తీవ్ర అస్వస్థతో బాధపడుతున్నారు. గ్రామంలో ఆయన సౌమ్యుడిగా ఉండేవారు. ఆయన మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. సత్యనారాయణ మృతి పట్ల ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, తోలేరు సర్పంచి వేండ్ర లీలా వెంకటకృష్ణ, ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని, జెడ్‌పిటిసి గుండా జయప్రకాష్ నాయుడు, టిడిపి నాయకులు వీరవల్లి చంద్రశేఖర్, మన్నె శ్రీనివాస్, మల్ల రాంబాబు, తోలేరు నీటి సంఘం అధ్యక్షులు ఇర్రింకి బలరామ్మూర్తి, వైసిపి నాయకులు నాగరాజు శ్రీనివాస్‌రాజు, జనసేన నాయకులు యరకరాజు హరిబాబు, చినబాబు సంతాపం వ్యక్తం చేశారు.


భోగిరెడ్డి సత్యనారాయణ(ఫైల్‌ఫోటో)

ఒంటి కాలిపై నిల్చొని మున్సిపల్ సిబ్బంది నిరసన

నరసాపురం:తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలంటూ మంగళవారం ఇంజినీరింగ్ విభాగంలో పని చేస్తున్న సిబ్బంది ఒంటి కాలిపై నిలబడి నిరసన తెలిపారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం గేట్ వద్ద జెఏసి ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. పనికి తగ్గ వేతనం ఇవ్వాలని, పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని, హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కెవి.కృష్ణ, రత్నం, సత్యనారాయణ, ఫణి, ఎం.సత్యనారాయణ, కె.శ్రీను, సుజాత పాల్గొన్నారు.

డయేరియాపై ఇంటింటా సర్వే

గణపవరం:గణపవరం పిహెచ్‌సి పరిధిలోని అన్ని సచివాలయాల పరిధిలో తమ సిబ్బంది ఇంటింటా డయేరియాపై సర్వే నిర్వహిస్తున్నట్లు పిహెచ్‌సి డాక్టర్ కె.ఓంకార్‌నాథ్ తెలిపారు. మంగళవారం స్థానిక రెండో సచివాలయంలో డయేరియాపై స్థానికులు, వైద్య సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదేళ్లలోపు పిల్లలకు నీళ్ల విరేచనాలైతే వారికి 15 రోజులపాటు ఒఆర్‌ఎస్ ద్రావణం, జింక్ మాత్రలు ఇచ్చి చికిత్స అందిస్తామని చెప్పారు. ఇంటింటా సర్వే ఈనెల 30వ తేదీ వరకూ ఉంటుందన్నారు. కమ్యూనిటీ హెల్త్ అధికారి జాలాది విల్సన్‌బాబు మాట్లాడారు. పిహెచ్‌ఎన్‌హెచ్ వి.సత్యవతి, ఎంఎల్‌హెచ్‌పి డి ఆశాజ్యోతి, ఎఎన్‌ఎం ఎస్తేరు మేరీ, ఆర్.రమాదేవి, హెల్త్ అసిస్టెంట్లు ఎ.శాంతకుమారి, ఆశాలు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - నరసాపురం

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్, ప్రయివేటు విద్యాసంస్థల్లో అధిక ఫీజులు, పుస్తకాల రూపంలో అధిక డబ్బులు వసూలు చేస్తున్న విద్యాసంస్థల యాజమాన్యంపై కఠిన చర్యలు తీసుకోవాలని పౌరుల సంక్షేమ సంఘం పట్టణ కన్వీనర్ ముచ్చర్ల త్రిమూర్తులు, విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ కన్వీనర్ సిహెచ్ రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్తు కోసం మంచి విద్యనందించాలనే బలహీనతను చేసుకుని వారి నుండి అధిక మొత్తంలో ఫీజులు, పుస్తకాల విక్రయంలో వేల రూపాయలు వసూలు చేస్తున్నారన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న సంస్థలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు బిఆర్ అంబేద్కర్ భవనం వద్ద జరగనున్న ఈ ఐక్య సమావేశంలో తల్లిదండ్రులు పాల్గొనాలన్నారు.విద్యార్థుల తల్లిదండ్రులుకె.నరసింహస్వామి, జి.శ్రీనివాసరావు, బి.ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవడమే లక్ష్యం : ఎంఎల్ఎ

తాడేపల్లిగూడెం:రైతును అన్నివిధాల ఆదుకోవడానికి కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎంఎల్‌ఎ బొలిశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం పెదతాడేపల్లి కమ్మ కళ్యాణ మండపంలో సర్ ఆర్థర్ కాటన్ ఎత్తిపోతల పథకం రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ రైతుల కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ప్రస్తుతం ఒక పంటకు మాత్రమే పరిమిత అనుమతులు ఉన్నట్టులేదని రెండో పంటకు కూడా రాతపూర్వకంగా అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. అనంతరం జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ ఇమ్మని రాజేశ్వరి సేవలు కొనియాడుతూ ఆమెను సత్కరించారు. బిజెపి నియోజకవర్గ కన్వీనర్ ఈతకోట తాతాజీ, టిడిపి నాయకులు పరిమి సురేష్, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

మలేరియాను నివారించాలి

తాడేపల్లిగూడెం:మలేరియాను నివారించాలంటే సమిష్టి కృషితో పనిచేయాలని మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు తెలిపారు. డాక్టర్ శ్రావ్య ఆధ్వర్యంలో మలేరియా సబ్ యూనిట్ అధికారి వై.లక్ష్మణరావు పర్యవేక్షణలో మంగళవారం వీకర్స్ కాలనీ పరిధిలోని 1, 2 వార్డుల్లో మలేరియా వ్యతిరేక మాసోత్సవాల సందర్భంగా గృహస్తులకు అవగాహన కల్పించారు, ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విధిగా డ్రై డే పాటించాలన్నారు. కార్యక్రమంలో వార్డు ఆరోగ్య కార్యదర్శులు శ్యామల, మల్లిక, ఆశాలు పాల్గొన్నారు.

పారదర్శకంగా 'తల్లికి వందనం'

భీమవరం టౌన్:కూటమి ప్రభుత్వం ఏడాది పాలన సందర్భంగా అమలు చేసిన తల్లికి వందనం పథకంపై వైసిపి నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ తోట సీతారామలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడారు. తల్లికి వందనంలో భాగంగా రూ.8,700 కోట్లను 67 లక్షల మంది విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాలలో జమ చేశామని, ఈ విషయాన్ని ఓర్చుకోలేకనే వైసిపి నాయకులు తప్పుడు ప్రచారాలు చేస్తున్నారని విమర్శించారు. పథకం రానివారు మీ సచివాలయాలలో ఫిర్యాదు చేయొచ్చునని తెలిపారు.

నరసాపురం: మండలంలోని యర్రంశెట్టి వారి పాలెం హైస్కూల్లో మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్, విద్యాశాఖ మంత్రి లోకేష్ చిత్రపటాలకు విద్యార్థుల తల్లిదండ్రులు పాలాభిషేకం చేశారు. స్కూల్ ప్రాంగణంలో సర్పంచి వైఎస్ నాగముత్యాలమ్మ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మాజీ ఎంపిపి ఉప్పుగంటి బాబులు, కొల్లాటి శ్రీను, మాజీ చైర్మన్ శ్రీను, హెచ్‌ఎం శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్సిళ్లు పంపిణీ

తాడేపల్లిగూడెం:కొమ్ముగూడెం గ్రామ సర్పంచి తాడేపల్లి బేబీ ఆధ్వర్యంలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, పెన్సిల్, రబ్బర్లు, ఎరేజర్లు మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచి బేబీ మాట్లాడుతూ విద్యార్థులు బాగా చదువుకుని, మంచి విద్యను అభ్యసించి భవిష్యత్తులో ఉన్నత స్థానానికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తాడేపల్లి శ్రీను, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


పుస్తకాలు అందజేస్తున్న సర్పంచి బేబీ

గణపవరం: గణపవరం మండల పరిషత్ ఒకటో పాఠశాల విద్యార్థులకు మంగళవారం మాజీ జడ్‌పిటిసి కార్యదర్శి కాజ వినాయక సర్పంచి మూర అంబారం పుస్తకాల కిట్ అందజేశారు. ఈ సందర్భంగా వినాయక మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఒకటో పాఠశాల అభివృద్ధికి తాను పాఠశాలను దత్తత తీసుకుంటున్నట్లు తెలిపారు. సర్పంచి అంబారం మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి మానవత ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. పాఠశాల ఉపాధ్యాయులు ఎంఎల్‌ఎస్‌ఎస్.నారాయణ, సచివాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పాలకొల్లులో వాహనాల తనిఖీ

పాలకొల్లు :కలెక్టర్ ఆదేశాల మేరకు పాలకొల్లు పట్టణంలో మంగళవారం వివిధ వాహనాలను రవాణా శాఖ అధికారులు తనిఖీ చేశారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, విత్‌అవుట్ డ్రైవింగ్ లైసెన్స్, ట్రిపుల్ రైడింగ్, విత్‌అవుట్ హెల్మెట్‌పై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ ఆళ్ళేటి బాబ్జి ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. పలువురికి ఫైన్ వేసి అవగాహన కల్పించారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యం : పితాని

పెనుమంట్ర:ప్రజల సంక్షేమంతో పాటు, అన్ని రంగాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ ధ్యేయమని ఆచంట ఎంఎల్‌ఎ పితాని సత్యనారాయణ అన్నారు. మంగళవారం పొలమూరులోని సిపిఎం కార్యాలయం సమీపంలో ఏర్పాటు చేసిన 63 కెవి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా జుత్తిగ గ్రామ సచివాలయం ప్రాంగణంలో నిర్మించిన పల్లె పండుగ మన పితాని కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ధాన్యం అమ్మిన రైతులందరి ఖాతాల్లో నగదు జమ అవుతుందన్నారు. టిడిపి మండల , జుత్తిగ, పొలమూరు, వెలగలవారి పాలెం గ్రామాల అధ్యక్షులు, కార్యదర్శులు కె.శ్రీనివాస రెడ్డి, గొలుగూరి వెంకట సత్యనారాయణ రెడ్డి, గుత్తుల శ్రీను, వెలగల బులి రామిరెడ్డి పాల్గొన్నారు.

గ్రామాల్లో దాహం దాహం..!

కలుషితమైన కాలువల నీరు
చెరువుల్లో తగ్గిన నీటి మట్టం
ప్రత్యామ్నాయ ఏర్పాట్లు శూన్యం
దాహార్తితో ప్రజల అవస్థలు


పసర్లుగా మారిన అన్నయ్యకోడు పంటకాలువలో నీరు

ప్రజాశక్తి - కాళ్ల

కాలువలకు నీరొచ్చినా తాగునీటి కష్టాలు మాత్రం తీరడం లేదు. ప్రస్తుతం ఏ కాలువల్లో చూసినా కలుషిత నీరు, వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. ఇప్పటికే తాగునీటి చెరువుల్లో నీటి మట్టాలు తగ్గి చెరువులు అడుగంటుతున్నాయి. దీంతో చెరువుల్లో నీరు చిక్కబడి మోటార్లు మొరాయించడం, పైపులైన్ల మరమ్మతులు వంటి సమస్యలు ఎక్కువగా ఎదురవుతున్నాయి. అయితే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడంలో అధికారులు, ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. దీంతో డెల్టా ప్రజలు దాహార్తితో అల్లాడిపోతున్నారు. తాగేందుకు స్వచ్ఛమైన నీరు దొరకని పరిస్థితి. ఈ నెల ఒకటో తేదీన కాలువలకు నీటిని విడుదల చేశారు. అయితే ముందుగా కాలువలు శుభ్రం చేయాలి, గుర్రపుడెక్క, తూడు చనిపోవడానికి రసాయనాలు వేయడంతో కాలువ నీరంతా కిందికి వెళ్లిపోవాలి. ఆ తర్వాతే పరిశుభ్రంగా వచ్చే నీటిని మాత్రమే పరీక్ష చేసి చెరువులు నింపాలి. ఈ తతంగమంతా పూర్తి కావాలంటే మరికొన్ని రోజుల సమయం పట్టే ఆవకాశం ఉంది. ఈలోపు తాగునీటి సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారు.

జిల్లాలో పంట కాలువలకు నీరు వదిలినా కాలువలు శుభ్రం చేయకపోవడంతో నీరు వదిలినా చెరువులు నింపుకునే పరిస్థితి లేకుండా పోయింది. జిల్లాలోని 20 మండలాల్లో ముఖ్యంగా కాళ్ల, పాలకోడేరు, భీమవరం రూరల్, ఉండి, ఆచంట, ఆకివీడు, నరసాపురం, యలమంచిలి తదితర మండలాల్లో తాగునీటి చెరువుల్లో నీటి మట్టం సగానికిపైగా తగ్గింది. దీంతో తాగునీటి సమస్య ఏర్పడింది.

జిల్లాలో 13,4,992 మంది జనాభా, 4,16,914 కుటుంబాలు ఉన్నాయి. 409 పంచాయతీల్లో 709 తాగునీటి పథకాలు ఉన్నాయి. 165కి పైగా గ్రామాల్లో చెరువులు దాదాపు అడుగంటాయి. కొన్ని తాగునీటి పథకాలు స్వచ్ఛమైన నీటిని సరఫరా చేస్తున్నాయి. అంతేకాకుండా చాలా గ్రామాల్లో ప్రజలకు సరిపడా నీటిని సరఫరా చేయలేకపోతున్నారు.


ఏలూరుపాడులో ఎడ్ల బండిపై నీరు తీసుకెళ్తున్న వైనం

చెరువుల సామర్థ్యం అంతంత మాత్రమే..!

తాగునీటి పథకాలకు సంబంధించి చెరువులు అభివృద్ధికి నోచుకోవడం లేదు. దీంతో కాలువలు పూడుకుపోయాయి. దీంతో నీటి నిల్వ సామర్థ్యం తగ్గిపోయి ప్రజలకు నీరు సరిపోని పరిస్థితి. చెరువులను అభివృద్ధి చేస్తేనే నీటి నిల్వ సామర్థ్యం పెరిగే అవకాశం ఉంటుంది. కాలువలకు నీటిని వదిలి పదహారు రోజులవుతున్నా కాలువ నీరు కలుషితంగానే వస్తోంది. స్వచ్ఛమైన నీరు ఎప్పుడొస్తుందా, ఎప్పుడు చెరువులు నింపుకోవాలా అని గ్రామ పంచాయతీ అధికారులు చూస్తున్నారు తప్ప సమస్య పరిష్కారానికి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదు. కనీసం ట్యాంకర్ల ద్వారా అయినా నీటిని సరఫరా వేయాలని ప్రజలు కోరుతున్నారు. కుళాయిల ద్వారా కొద్ది సమయం మాత్రమే నీటిని విడుదల చేయడంతో సరిపోవడం లేని మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని గ్రామాల్లో అయితే విద్యుత్ మోటార్ల వినియోగం పెరగడంతో శివారు గ్రామాలకు నీరు అందని పరిస్థితి. కుళాయిలు వదిలే సమయంలో విద్యుత్ సరఫరా నిలుపుదల చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

40 శాతానికి పడి పోయిన నీటి మట్టాలు..

కాళ్ల, నరసాపురం, మొగల్తూరు తదితర మండలాల్లోని తాగునీటి చెరువుల్లో నీటి మట్టాలు 40 శాతానికి పడిపోయాయి. కాలువల ద్వారా వచ్చే స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. తాగునీటి చెరువులోని కలుషితనీటిని బయటకు తోడి, చెరువును శుభ్రం చేసి ఆ తరువాత కాలువ ద్వారా వచ్చే స్వచ్ఛమైన నీటిని నింపుకోవాల్సి ఉంది.

ఆర్ఒ ప్లాంట్ల నీరు కొనుగోలు..

అధికశాతం మంది ప్రయివేటు ఆర్ఒ ప్లాంట్లపైనే ఆధారపడుతున్నారు. ఎండ్ల బళ్లపై, సైకిళ్ల వెళ్లి నీరు తెచ్చుకుంటున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలు సరఫరా చేసే నీటి నాణ్యత సరిగ్గా లేకపోవడమే దీనికి కారణమని వాపోతున్నారు. అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

స్వచ్ఛమైన నీటిని నింపుకోవాలి..

తానింకి శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యుఎస్, డిఇ, భీమవరం

కాలువల్లో నీటిని పరీక్షించిన తర్వాతే తాగు చెరువుల్లోకి నింపాలి. చెరువుల్లో ఉన్న కలుషిత నీటిని బయటకు తోడాలి. పూర్తిస్థాయిలో స్వచ్ఛమైన నీటితో నింపాలి. గ్రామాల్లో తాగునీటి సమస్య రాకుండా గ్రామ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీచేశాం.

స్థానికులే చెరువులను పరిరక్షించుకోవాలి

ఎంపిపి దుర్గాభవాని

ప్రజాశక్తి - వీరవాసరం

తాగునీటి చెరువులను స్వచ్ఛందంగా స్థానికులే సంరక్షించుకోవాలని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అన్నారు. మత్స్యపురిపాలెం పంచాయతీ పరిధిలోని కమతాలపల్లి గ్రామంలో మండల పరిషత్ నిధులు రూ.11 లక్షలతో అభివృద్ధి చేసిన చెరువులను మంగళవారం పరిశీలించారు. ఎంపిపి మాట్లాడుతూ సామాజిక స్పృహతో చెరువులను గ్రామస్తులు కలుషితం కాకుండా పరిరక్షించుకోవాలన్నారు. వ్యర్థాలను చెరువుల్లో పారవేయొద్దన్నారు. చెరువు గట్లపై ఫలసాయం ఇచ్చే మొక్కలు నాటుకుని ఆదాయం సమకూర్చుకోవాలన్నారు. ఎన్నో సంవత్సరాలుగా పూడుకుపోయిన ఈ చెరువులను వినియోగంలోకి తీసుకురావడంతో ఒక చెరువు ద్వారా పంచాయతీ వారు తాగునీటి అవసరాలకు ఉపయోగిస్తున్నారు. దళితపేటలోని మరో శ్మశాన చెరువును స్థానిక అవసరాలకు వినియోగంలోకి తీసుకురానున్నట్టు ఎంపిపి తెలిపారు. చెరువుల అభివృద్ధికి నిధులు కేటాయించడం పట్ల స్థానికులు ఎంపిపికి కృతజ్ఞతలు తెలిపారు. అదే విధంగా అధ్వానంగా ఉన్న రహదారులకు నిధులు కేటాయించాలని ఎంపిపిని కోరారు. నిధుల లభ్యతను బట్టి కేటాయిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కనకారావు పాల్గొన్నారు.

9న జాతీయ సమ్మె జయప్రదం చేయాలి

సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజారామ్మోహన్‌రాయ్

ప్రజాశక్తి - పాలకొల్లు

జులై 9న జరిగే కార్మికుల జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.రాజా రామ్మోహన్ రాయ్ కోరారు. మంగళవారం పాలకొల్లు మహిళా సంఘం భవన్‌లో సత్తింశెట్టి పురుషోత్తం అధ్యక్షతన మండల సమన్వయ సమావేశం జరిగింది. సమావేశంలో రాయ్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మికులు పోరాడి సాధించుకున్న హక్కులను కార్పొరేట్ శక్తుల కోసం నీరుగారుస్తోందని విమర్శించారు. కార్మికుడు సంఘం పెట్టుకునే హక్కు లేకుండా చేసి యజమానులకు బానిసలుగా మార్చాలని చూస్తోందన్నారు. ఇప్పటి వరకూ లేని మహిళలు రాత్రి డ్యూటీ చేయాలని నిర్ణయించడం దుర్మార్గమన్నారు. సమ్మెను జయప్రదం చేసి ఐక్యత తో కార్మిక హక్కులు కాపాడుకోవాలన్నారు. ఈ సమావేశంలో జవ్వాది శ్రీనివాసరావు, దేవ సుధాకర్, సిహెచ్. లక్ష్మి, శ్రీదేవి, గుబ్బల సత్యనారాయణ మాట్లాడారు. వీరవల్లి సత్యనారాయణ, రెడ్డి అప్పారావు, ఇరగరపు రాజు, ఝాన్సీ, పద్మావతి, ముత్యాలు, శ్రీను పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, Govardhanam Gopala Charyulu S/o. Govardhanam Satyanarayana R/o. D.No: 2-13b, Mainroad, Near Madanagopalaswamy Temple, Munduru Village, Pedavegi Mandal, Eluru District, Andhra Pradesh. PIN-534452 . I have Changed my Name from Govardhanam Gopala Achari (Old Name) to **GOVARDHANAM GOPALA CHARYULU** (New Name). Hence forth I am being called as **GOVARDHANAM GOPALA CHARYULU** (New Name) for all purposes.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ వెంప గ్రామంలోని సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్ సైని ఫిషరీస్ అసిస్టెంట్ మంగాదేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ పంచాయతీ కార్మికులు ఏళ్ల తరబడి ప్రజలకు సేవలందిస్తున్నప్పటికీ కనీస వేతనాలు అమలు చేయకపోవడం వల్ల కుటుంబాలు గడవక పస్తులుండే పరిస్థితులు ఏర్పడుతున్నాయన్నారు. టెండర్ల పేరుతో జీతాలు పెండింగ్లో ఉండడం వల్ల కిరాణా షాపుల్లో అప్పులు కూడా పుట్టడం లేదన్నారు. ఐదు సంవత్సరాలుగా రూపాయి కూడా వేతనం పెంచలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనాలు అమలు చేయాలని, ఇఎస్ఐ, పిఎఫ్ గుర్తింపు కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. చింతాడ సత్యనారాయణ, చిర్ర తామస్, చిలకపాటి పౌలు, కృష్ణారావు, వేణుగోపాల కృష్ణంరాజు పాల్గొన్నారు.

రూ.307 వేతనం అమలు చేయాలి : వ్యకాస

ప్రజాశక్తి - తణుకు

ఉపాధి హామీ కూలీలకు ప్రభుత్వం ప్రకటించిన రూ.307 వేతనం ఎక్కడా అమలు కావడం లేదని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బళ్ల చిన వీరభద్రరావు అన్నారు. అత్తిలి మండలం గుమ్మంపాడులో పనిచేస్తున్న కూలీలతో కొద్దిసేపు మాట్లాడారు. ఈ నేపథ్యంలో వీరభద్రరావు వద్ద పలువురు కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన కూలి రూ.307 రావడంలేదని, దాదాపు 10 వారాలకు పైగా చేసిన పనికి బకాయిలు ఉంటే, కేవలం వారం రోజులకే ఎకౌంట్లో డబ్బులు జమ చేశారని, ఇలాగైతే తాము ఎలా బతకాలని వాపోయారు. ఈ సందర్భంగా వీరభద్రరావు మాట్లాడుతూ గతేడాది కేంద్ర ప్రభుత్వం నియమించిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ సర్వే చేసి ఉపాధి హామీలో అమలు చేస్తున్న వంద రోజుల పని 150 రోజులకు పెంచాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా కూలీలకు రూ.437 కూలి పెంచాలని, ఇచ్చిన నివేదిక కాగితాలకే పరిమితమైందని తెలిపారు. కూలీల పొట్ట కొట్టి పెత్తందారులకు దోచి పెట్టే దుర్మార్గమైన విధానం మానుకోవాలని ఆయన ప్రభుత్వానికి సూచించారు. ఈ చట్టాన్ని యథాతథంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెచ్చెట్టి హైమ, చినమిల్లి శ్రావణి, కటికితల మౌనిక, ఉప్పల పండు, గొల్లపల్లి రమేష్ పాల్గొన్నారు.

ప్రవీణ్‌పై ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలి

సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్

ప్రజాశక్తి - ఆచంట

ఫేస్ బుక్, వాట్సప్ గ్రూపుల్లో ఫేక్ ఐడిలతో తనపై తప్పుడు ప్రచారం చేసి, తన మనోభావాలను దెబ్బ తీసిన బైరిశెట్టి ప్రవీణ్‌పై ఎస్‌సి ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆచంట పోలీస్ స్టేషన్‌లో మంగళవారం పోలీస్ సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. అనంతరం సుంకర సీతారామ్ మాట్లాడుతూ సమాజంలో గౌరవ ప్రదమైన సర్పంచి పదవిలో ఉన్న తన ఫొటోలు, ఆచంట మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్‌గా పని చేసిన నా భార్య సుంకర ఇందిర ఫొటోలు ఆచంట స్క్రిబెస్ అనే ఫేక్ ఐడిలతో పెట్టి మమ్మల్ని తీవ్రంగా అవమానం కలిగించేలా బైరిశెట్టి ప్రవీణ్ ప్రవర్తించాడని, అతనిపై చట్ట పరంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అతనే కాకుండా ఇదే ఐడితో మరో ముగ్గురు ఆ పేజీ వాడుతున్నారని విమర్శించారు. ఇలాంటివి పెట్టిన మనోభావాలను దెబ్బ తీసేవిధంగా వ్యవహరించిన ప్రవీణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటువంటి వారిని ప్రోత్సహిస్తున్న రాజకీయ పార్టీ నాయకులు సిగ్గుతో తలదించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో శేషమ్మచెర్వు సర్పంచి జక్కంశెట్టి శ్రీరాములు, వైసిపి నాయకులు కోట వెంకటేశ్వరరావు, గణేషుల సుబ్బారావు, నంబూరి రాజా, పెచ్చెట్టి సత్యనారాయణ, ముత్యాల నాగేశ్వరరావు పాల్గొన్నారు

చిలకమర్తి, ఝాన్సీలక్ష్మీబాయికి నివాళి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

కళాప్రపూర్ణ చిలకమర్తి లక్ష్మీనరసింహం బహుముఖ ప్రజ్ఞాశాలి అని, స్వాతంత్ర పోరాటంలో ధీర వనిత ఝాన్సీ లక్ష్మీబాయి అని పలువురు వక్తలు కొనియాడారు. మంగళవారం జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో భీమవరం క్విట్ ఇండియా స్తూపం వద్ద చిలకమర్తి లక్ష్మీనరసింహం, ఝాన్సీ లక్ష్మీబాయి వర్ధంతిని నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వసుధ ఫౌండేషన్ కన్వీనర్ మంతెన వెంకట రామరాజు, రచయిత కలిగోట్ల గోపాలశర్మ మాట్లాడుతూ చిలకమర్తి సమాజ సేవతోపాటు ఇటు సాహితీ సేవ చేస్తూ ఆనాడు సమాజంలో అనేక దురాచారాలపై పోరాడారని తెలిపారు. జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గాతల జేమ్స్, ఎస్.సత్యనారాయణ రాజు, నిర్వాహకులు చెరుకువాడ రంగసాయి మాట్లాడారు. ఎన్నో ఉద్యమాలు చేసిన గొప్ప మహిళా సమరయోధులు ఝాన్సీ లక్ష్మీబాయి అన్నారు. కార్యక్రమంలో ఐజాక్ బాబు, అరవ భాస్కరరావు, ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు ఎస్‌కె.చాన్ భాషా, సీతారామరాజు పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 293/2021

యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ...వాది
రిప్రిజింటెండ్ బై బ్యాంకు మేనేజర్,
హరిప్రియ మాన్సన్, బ్యాంకు స్ట్రీట్, పాలకొల్లు
మరియు
డి1: వేములు అశ్విని కుమార్, ...ప్రతివాదులు
తండ్రి: భాస్కరరావు, డోర్ నెం. 25-11-14/1,
సాయి నగర్, పాలకొల్లు.
డి2: వేముల శ్రీదేవి,
భర్త: అశ్విని కుమార్, డోర్ నెం. 25-11-14/1,
సాయి నగర్, పాలకొల్లు.

పై నంబరు పిటిషన్‌లో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినప్పటికీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. **ది. 23-06-2025 తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు ప్రత్యక్షంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన కోర్టు వారికి విన్నవించుకోవలెను. లేని పక్షంలో పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

ఆర్.వి. సూర్యనారాయణ
పాలకొల్లు అడ్వకేటు,
తేది. 17-06-2025 పాలకొల్లు
సెల్ నెం. 98490 10456

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 289/2021

యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ...వాది
రిప్రిజింటెండ్ బై బ్యాంకు మేనేజర్,
హరిప్రియ మాన్సన్, బ్యాంకు స్ట్రీట్, పాలకొల్లు
మరియు
డి1: ఆరేపల్లి సుశీల, ...ప్రతివాదులు
భర్త: రాజేశ్వరరావు, డోర్ నెం. 21-15-74,
బంగారువారి చెర్వు గట్టు, పాలకొల్లు.
డి2: మెట్ల నారాయణరావు,
తండ్రి: రామారావు, డోర్ నెం. 21-1-85/ఎ,
బంగారువారి చెర్వు గట్టు, పాలకొల్లు.

పై నంబరు పిటిషన్‌లో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినప్పటికీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. **ది. 23-06-2025 తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు ప్రత్యక్షంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన కోర్టు వారికి విన్నవించుకోవలెను. లేని పక్షంలో పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

ఆర్.వి. సూర్యనారాయణ
పాలకొల్లు అడ్వకేటు,
తేది. 17-06-2025 పాలకొల్లు
సెల్ నెం. 98490 10456

పలు చోట్ల అంగన్‌వాడీ పిలుస్తోంది

ప్రజాశక్తి - మొగల్తూరు

అంగన్వాడీల ద్వారా ప్రభుత్వం చిన్నారులకు అందిస్తున్న లబ్ధిని సద్వినియోగం చేసుకోవాలని అంగన్వాడీ సిబ్బంది తల్లిదండ్రులను కోరారు. మొగల్తూరు సెక్టార్ పరిధిలోని నక్కవారిపాలెం, పితానివారిపాలెం అంగన్వాడీ కేంద్రాల వద్ద అంగన్వాడీ పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అంగన్వాడీ కిట్లు అందించారు. ఆయా కార్యక్రమాల్లో చిన్నారులు, తల్లిదండ్రులు అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

మహారాజశ్రీ నరసాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
O.S.No. 291/2021

యూనియన్ బ్యాంకు ఆఫ్ ఇండియా ...వాది
రిప్రిజింటెండ్ బై బ్యాంకు మేనేజర్,
హరిప్రియ మాన్సన్, బ్యాంకు స్ట్రీట్, పాలకొల్లు
మరియు
డి1: తుంటా కస్తూరి, ...ప్రతివాదులు
భర్త: రామారావు, డోర్ నెం. 25-11-14/1,
శంబునిపేట, పాలకొల్లు.
డి2: తుంటా రామారావు,
తండ్రి: రామారావు ఆదియ్య, డోర్ నెం. 25-11-14/1,
శంబునిపేట, పాలకొల్లు.

పై నంబరు పిటిషన్‌లో మీకు ఎన్ని పర్యాయములు నోటీసులు పంపించినప్పటికీ మీరు తీసుకోకుండా కాలయాపన చేయుచున్నందున ఈ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది. **ది. 23-06-2025 తేదిన ఉదయం గం. 10-30 ని॥లకు** మీరు ప్రత్యక్షంగా గాని, మీ ప్లీడరు గారి ద్వారా గాని మీ వాదన కోర్టు వారికి విన్నవించుకోవలెను. లేని పక్షంలో పై పిటీషన్ మీ పరోక్షమున తీర్మానించబడును.

ఆర్.వి. సూర్యనారాయణ
పాలకొల్లు అడ్వకేటు,
తేది. 17-06-2025 పాలకొల్లు
సెల్ నెం. 98490 10456

In The Court of The Motor Accident Claims Tribunal Hon'ble V th Addl. District Judge Euru
MVOP.No. 386/2024

Between:
పెనుమత్స వేద కుమారి & అదర్స్ ...పిటిషనర్స్
And
నాయుడు హర గోపాల్ & అదర్స్ ...రెస్పాండెంట్స్
పై నెంబరు గ్రంధంలో R.2
నాయుడు నారాయణ
S/o. శ్రీరాములు ఓనర్ ఆఫ్ కార్ బేరింగ్ నెం. Ap 16 DN. 1213. R/o. No. 22-179 ఇంగ్లీష్ పారం, మచిలీపట్నం.

అను వారికి నోటీసు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 18-06-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి తమ అక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
K. నాగేశ్వరరావు
ఏలూరు అడ్వకేట్
తేది:17-06-2025 ఏలూరు
సెల్: 94411 50114

In The Court of The Hon'ble VII th Addl. District Judge (Family Court) Eluru
I.A.No. 1/2024 in O.S.No. 48/2019

Between:
కురేళ్ళ బేబి ...ప్లయింటిఫ్
And
K. రాజారత్నం & అదర్స్ ...డిఫెడెంటెంట్స్
పై నెంబరు గ్రంధంలో D.5
దాసరి నాగ వెంకట సత్యనారాయణ
S/o. రామారావు, D.No: 30-9/11
దక్షిణపు వీధి, ఏలూరు.

అను వారికి నోటీసులు అమలు కొరకు పై కోర్టు వారి ఎదుట **ది. 23-06-2025 వ తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గానీ, ప్లీడరు గారి ద్వారా గాని హాజరు అయి తమ అక్షేపణలు తెలుపుకోగలరు. లేనియెడల దావా సంగతులు తమ పరోక్షమున తీర్మానించెదరు.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
K. నాగేశ్వరరావు
ఏలూరు అడ్వకేట్
తేది:17-06-2025 ఏలూరు
సెల్: 94411 50114

SUIT-NOTICE
మహారాజశ్రీ 1వ అదనపు జిల్లా జడ్జ్ కోర్ట్ ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లా
O.S.No. 109/2018

Between:
Smt. Maganti Padma Valli Devi ...**Plaintiff**
And
Smt. Pydi Seetha Mahalakshmi ...**Defendant**
To, Defendant:
పైడి సీత మహాలక్ష్మి, W/o. లేటు వీరరాఘవులు, R/o Door No. 24బి-18-2, మంచినీళ్ళ తోట, పత్తేబద, ఏలూరు, ఏలూరు మండలం, ప.గో.జిల్లా (పాత), ఏలూరు జిల్లా (కొత్త).

SUIT-NOTICE

పై దావా గ్రంధంలో plaintiff తరుపున వారియొక్క లాయర్ గారు Defendant గార్కి వారియొక్క ఆన్ రికార్డ్ అడ్వకేట్ గార్కి వాది తరుపు సాక్ష్యం అఫిడవిట్స్ పై నోటీస్ తీసుకొనమని ఇవ్వగ వారు తీసుకొనుటకు నిరాకరిస్తూ ప్రతివాది తరుపున no instructions చెప్పినారు గాన కోర్ట్ వారు ప్రతివాది యొక్క శాశ్వత చిరునామాకు మరియు మారెనని చెప్పుకుంటున్న అడ్రసులకు కోర్ట్ అమీన మరియు పోస్టల్ శాఖ వారిచే రిజిస్టర్ పోస్ట్ ద్వారా పై దావా నోటీసులు కోర్టువారు పలుమార్లు పంపిన మీరు తీసుకొనక పలువిధమైన సాకులతో తిరిగి పంపించుచున్నారు. కావున కోర్ట్ వారు న్యూస్ పేపర్ ప్రకటన ద్వారా మీకు పై దావా నోటీస్ జారీ చేయమని ఉత్తర్వులు యిచ్చినారు. కావున ఇందుమూలంగా పైన తెలియజేసిన Defendant వారిని సదరు శ్రీ వారి కోర్టు ఎదుట **ది. 30-06-2025 వ సం॥రం తేదీన ఉదయం గం. 10-30 ని॥లకు** స్వయంగా గాని, లేక లాయర్ గారి ద్వారా గాని హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు శ్రీ కోర్ట్ వార్కి తెలియజేయవలెను. లేనిచో శ్రీ కోర్ట్ వారు మీ పరోక్షంలో సదరు వ్యాజ్యం ను పరిష్కరించెదరని ఇందుమూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం)
సం/- నేమాల సుబ్రహ్మణ్యం
ఏలూరు అడ్వకేట్, ఏలూరు
తేది:17-06-2025 AP/1973/2001